క్లుప్తంగా

బదిలీపై వచ్చిన హెచ్‌ఎంలు

తాళ్లపూడి: మండలంలోని ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. వేగేశ్వరపురం హైస్కూల్‌కు వై.సత్యనారాయణ, అన్నదేవరపేట హైస్కూల్‌కు డి.పద్మసుజాత, గజ్జరం హైస్కూల్‌కు సీహెచ్ నెహ్రూజీ, మలకపల్లి హైస్కూల్‌కు కె.శ్రీవాసవి, పెద్దేవం హైస్కూల్‌కు సీహెచ్ నాగేంద్రరావు, తాళ్లపూడి హైస్కూల్‌కు సీహెచ్ సుబ్బలక్ష్మి బదిలీపై వచ్చారు. ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు.

తాళ్లపూడి ఎంపీడీవోగా రమణ


ఎంపీడీవోకు అభినందలు తెలుపుతున్న సిబ్బంది

తాళ్లపూడి: స్థానిక ఎంపీడీవోగా టీబీవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లిలో సూపరింటెండెంట్‌గా పని చేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మండలంలోని ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు కేఎస్‌వీరన్న, డీఎస్‌సీ శ్రీనివాస్, రామలక్ష్మి, కామేశ్వరి, హేమంతి, ఇతర సచివాల కార్యదర్శులు కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవోలు

నిడదవోలు: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీవోలు పి.శామ్యూల్, జీవీఎస్ రామకృష్ణంరాజు, డి. దామోదర్‌లు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యేకి పుష్ప గుచ్చాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు.

పీహెచ్‌సీలో స్పెషల్ వైద్య సేవలు

ఉండ్రాజవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారని పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా 3వ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ప్రసూతి స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ మృదుల, చెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ మేరీ వసంత అందుబాటులో ఉంటారన్నారు. ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ జితేంద్ర శ్రీఫణి తేజ ప్రతి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వారి సేవలను ప్రజలకు అందిస్తారని తెలిపారు. మండల ప్రజలు వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రసాద్ కోరారు.

బీమా అందజేత


మృతుని కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

నల్లజర్ల: అనంతపల్లిలో మృతి చెందిన బళ్ల శ్రీనివాస్ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10వేలను గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గా పావనీ అందజేశారు. గ్రామ నాయకులు జాదుల దుర్గారావు, జి.సాంబశివ నాయుడు, వలంటీర్ భార్గవీరేఖ పాల్గొన్నారు.

ఆలయంలో తాచు పాము


పోలేరమ్మ గుడిలో తాచుపాము

నల్లజర్ల: అనంతపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం తాచుపాము హల్‌చల్ చేసింది. ఆలయం శుభ్రం చేయడానికి వెళ్లిన వారు గర్భగుడి తలుపులు తెరవగానే ఎనిమిది అడుగుల తాచు పాము కనిపించింది. పౌర్ణమి తర్వాత తాచుపాములు ఇలా ఆలయాల్లోకి ప్రవేశించడం పారిపాటేనని, దానిని బయటకు వదిలేశారు. పక్కనే సంజీవ కొండ ఉండడంతో పాములు ఎక్కువగా వస్తుంటాయని రైతులు చెబుతున్నారు. అక్కడున్నవారు పాము చూస్తూ తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.

తాగునీటి ఇబ్బందులుంటే తెలియజేయండి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని ఏడివిజన్‌లోనూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఒకవేళ ఎక్కడైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాజమహేంద్రవరం నగర వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఏ డివిజన్‌లో అయినా లోప్రెజర్‌తో నీరు సరఫరా రాకపోతే వెంటనే తన కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీ భరత్ తెలిపారు.

చిన్నారుల భవితకు బాటలు

- విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు
- మారిన పాఠశాలల రూపురేఖలు
- విద్యార్థులకు సకల సౌకర్యాలు


కొత్త హంగులతో నందమూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కొవ్వూరు: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాటలు వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి వేల కోట్ల రూపాయలు ఈ రంగంపై వెచ్చించారు. కార్పొరేట్ విద్యకు దీటుగా విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారా పేద పిల్లలకు అందించాలన్న సంకల్పంతో అడుగులు వేస్తున్నారు. ఏ పేద వాడికి తమ పిల్లల చదువు భారం కాకూడదని, చిన్నారుల ఉన్నత చదువులకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఒక మేనమామగా పేద పిల్లల చదువు బాధ్యతను తనపై వేసుకున్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నూతన విద్యా వ్యవస్థకి రూపకల్పన చేశారు. కొవ్వూరు మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు ఏడు వేల మంది విద్యార్థులు విద్యా భ్యాసం చేస్తున్నారు. 12 హైస్కూళ్లు, రెండు యూపీ, 39 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఎస్సీ సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు రెండు నడుస్తు న్నాయి.

నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపు రేఖలు

టీడీపీ హయాంలో చిన్నాభిన్నమైన విద్య వ్యవస్థలో సమూల మార్పులు తెసుకొచ్చి మండలంలో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల రూపురేఖలను మార్చారు. ఇప్పటికే మొదటి దఫాగా మండలంలో 25 పాఠశాలల అభివృద్ధికి రూ.6.25 కోట్లు వెచ్చించారు. రెండో విడతలో 33 పాఠశాలలకు రూ.11.12 కోట్లు వెచ్చిస్తున్నారు. ప్రధానంగా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుదీకరణ, ఫ్లోరింగ్ టల్స్, రంగురంగుల బెంచీలు, డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు, మినరల్ వాటర్ ప్లాంట్లు, సౌకర్యవంతమైన కిచెన్ షెడ్లు, ప్రాంగణంలో చక్కటి గార్డెన్ అభివృద్ధి, నూతన భవనాల నిర్మాణం, పాఠశాలలకు చక్కటి రంగులు వేయించడం వంటి పనులు ఈ పథకం ద్వారా చేయిస్తున్నారు.

విద్యా కానుకతో తల్లిదండ్రులకు ఊరట

పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయంటే తల్లిదండ్రుల్లో ఒక్కటే ఆందోళన. పిల్లలు స్కూలుకు వెళ్లాలంటే పుస్తకాలు తదితర సామగ్రి కోసం వేల రుపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ బెంగలేదు. ప్రభుత్వమే వాటిని సమకూర్చుతోంది. పిల్లలకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్సులు, ఇంగ్లిష్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, బెల్టు వంటి ఎనిమిది రకాల విద్యా సామగ్రి జగనన్న విద్యా కానుక పథకం పేరుతో ప్రతి విద్యార్థికి అందిస్తున్నారు. గతంలో ఒక్కో కిట్‌కి రూ.1,600 వెచ్చిస్తే ఈ ఏడాది మరింత మెరుగైన సామగ్రికి రూ.2,500 చొప్పున ఖర్చు చేస్తోంది. నాలుగేళ్లలో 28,195 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల ద్వారా కిట్లు అందజేస్తున్నారు.



ఐ.పంగిడి హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత(ఫైల్), విద్యా కానుక కిట్లు

గోరు ముద్దతో పౌష్టికాహారం

మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. విద్యార్థులకు అందించే భోజన మెనులో మార్పులు తీసుకొచ్చి జగనన్న గోరుముద్ద పథకం బలంగా ఉన్న ఆహారం అందిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉన్న మెను, చార్జీలను దాదాపు రెట్టింపు చేశారు. భోజనంతో పాటు వారంలో ఐదు రోజులు గుడ్లు, మూడు రోజులు వేరుశెనగ చిక్కి అందిస్తున్నారు. ఈ ఏడాది నుంచి పోషక విలువలతో కూడిన రాగి జావ కూడా ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా మండలంలో నాలుగేళ్లలో 28,884 మంది లబ్ధి పొందారు. వారి నిమిత్తం రూ.8,87,70,000 ఖర్చు చేస్తున్నారు.

తల్లుల ఖాతాలకు జమ

మూడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదువుతున్న పిల్లలకు ఏటా రూ.1,6000 చొప్పున జగనన్న అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా నాలుగేళ్లలో 17,760 మంది విద్యార్థులకు రూ.23,92,11,100 వెచ్చించారు. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి ఇతర ఉన్నత చదువుల ఫీజులకు ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా ఫీజు రియంబర్స్‌మెంటు పథకం ద్వారా సాయం అందిస్తున్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.20వేలు, జగనన్న వసతి దీవెన ద్వారా రెండు విడతల్లో రూ.20వేలు చొప్పున తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. కొవ్వూరు మండలంలో 4,129 మందికి రూ.3.94 కోట్లు, వసతి దీవెన పథకం ద్వారా 4,223 మందికి రూ.3,26,25,892 తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు.

డిజిటల్ విద్యా

మండలంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు ఇంగ్లిష్ విద్యా విధానం అమలు చేస్తోంది. పది హైస్కూలు, ఒక యూపీ, ఐదు ప్రాథమిక పాఠశాలల్లో విద్యా విధానం అమలులోకి తెచ్చింది. ఎల్ఈడీ టీవీ ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న 896 మందికి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేశారు. ఒక్కో ట్యాబ్‌కి రూ.16,500 చొప్పున రూ.1,47,84,000 ఇందు కోసం ఖర్చు చేశారు.

కాలనీల అభివృద్ధికి నిధుల మంజూరు


ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: గ్రామంలోని రెండు కాలనీల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. గ్రామ శివారున గల చంద్రబాబు కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి రూ.25 లక్షల చొప్పున రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. 2000–2001లో అప్పటి టీడీపీ కాలనీలు ఏర్పాటు చేసింది. 20 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సుమారు 600 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారు. పట్టాలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీల అభివృద్ధిని పట్టించుకోలేదు. దాదాపు 20 ఏళ్లుగా ప్రజలు రోడ్లు, మంచి నీటి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారు. 2004లో సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో గ్రావెల్ రోడ్లు నిర్మాణం చేపట్టారు. అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం కనీసం ఎక్కడా ఒక్క సీసీ రోడ్డు కూడా నిర్మించలేదు. ఇప్పుడు కాలనీ వాసులకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కాలనీల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. రెండు కాలనీల్లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్లు నిర్మాణం చేశారు. ఇటీవల గడపగడపకూ నిధులు రూ.10లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేశారు. మళ్లీ రూ.50 లక్షలు మంజూరు చేశారు. వచ్చే ఏడాది నాటికి రెండు కాలనీల్లో రోడ్లు నిర్మాణం పూర్తి చేయనున్నారు.

వాహనాల తనిఖీ

చాగల్లు: గ్రామ శివారు, ప్రధాన కూడళ్లలో వాహనాలను తనిఖీ చేసినట్టు ఎస్సై సీహెచ్‌ఏ రమేష్ శుక్రవారం తెలిపారు. మితిమిరిన వేగంతో పాటు హెల్మెట్లు ధరించకుండా, నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న పది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి, రూ.1,880 జరిమానాలు విధించినట్టు ఎస్సై తెలిపారు.

జగన్ పాలనలో వ్యవసాయం పండగ

- ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు
- వెలగదుర్రుతో నూతన భవనాలు ప్రారంభం


వెలగదుర్రులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు

ఉండ్రాజవరం: వ్యవసాయాన్ని పండగలా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యచరణ అమలు చేస్తుందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు అన్నారు. వెలగదుర్రు గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. పంటలను గిట్టుబాటు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయిస్తుందని అందుకు రైతు భరోసా కేంద్రాలు రైతులకు అండగా నిలుస్తున్నాయన్నారు. గ్రామాల్లోనే పరిపాలన ప్రజలకు చేరుతుందన్నారు. వైద్యానికి, విద్యాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జగనన్న కాలనీలోని మహిళలతో మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహ మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ, ఎంపీటీసీ సభ్యరాలు ధనిశెట్టి భ్రమరాంబ, సాగి రామకృష్ణం రాజు, ముదునూరి సతీష్‌వర్మ, ఇందుకూరి మురళికృష్ణంరాజు, ముదునూరి నారాయణ రాజు, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, ధనిశెట్టి ఉమామహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలైన వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకవల్లి భగవాన్‌దాస్‌ను ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ఉదారత
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం


క్షతగాత్రులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు

నిడదవోలు: పట్టణంలోని ఓవర్‌బ్రిడ్జిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ముప్పిడి ప్రభాకర్ మోటారుసైకిల్‌పై నిడదవోలు వెళుతుండగా ఓవర్‌బ్రిడ్జిపై నిడదవోలు నుంచి రాజమండ్రి వెళుతున్న కారు టైర్ ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపు తప్పి మోటారుసైకిల్‌ను ఢీకొంది. దీంతో ముప్పిడి ప్రభాకర్‌కు తీవ్ర గాయాలవడంతో 108లో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలిలించారు. అప్పుడే పట్టణంలోని ఎమ్మెల్యే కార్యంపు కార్యాలయం నుంచి ఉండ్రాజవరం మండలంలో ప్రభుత్వ నూతన భవనాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు బయలుదేరారు. ఈ మార్గ మధ్యలో నిడదవోలు ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని ఆయన గమనించి వెంటనే కారు దిగి సంఘటన స్థలానికి వెళ్లి గాయాలతో ఉన్న ప్రభాకర్ చూసి ఆయన చలించిపోయారు. 108కి కాల్ చేసి దగ్గరుండి వాహనంలో ఎక్కించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యాధికారులతో ఆయన మాట్లాడి మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. పట్టణ ఎస్సై పి.నాగరాజుతో మాట్లాడి ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే చేసిన సాయానికి పలువురు అభినందించారు.

12 లోపు విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరాలి

పాఠశాల్లో కిట్లను పరిశీలించిన అధికారులు


గోపాలపురం బీసీ హాస్టల్‌లో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి నరసింహారెడ్డి

గోపాలపురం: జగనన్న విద్యాకానుక కిట్లు ఈ నెల 12వ తేదీ లోపు ఆయా పాఠశాలలకు సరఫరా చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి పి.నరసింహారెడ్డి అన్నారు. గోపాలపురం బీసీ హాస్టల్‌లో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యాశాఖ అధికారులకు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. విద్యాకానుక కిట్లు పాఠశాలలు తెరిచే సరికి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు, సీఆర్పీలు కె.నాగరాజు, ఎం.శ్యాంమ్ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిధిలోని 70 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీఉన్నత పాఠశాలలకు చెందిన 6,709 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్ ఎం.గంగరాజు తెలిపారు. నిడదవోలు బాలికోన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈనెల 12న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్‌లై డీటీ సత్యనారాయణ, ఎంఈఓ కిషోర్ కుమార్, హెచ్‌ఎం లక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక ప్రాథమిక పాఠశాల–1లో శుక్రవారం జగనన్న విద్యాకానుకలను తహసీల్దారు వి.కిశోర్‌కుమార్ పరిశీలించారు. మండలంలో 51 పాఠశాలలకు సంబంధించి 5,989 మంది విద్యార్థులకు కిట్లు అందజేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట వీఆర్వో లక్ష్మణమూర్తి ఉన్నారు.

యంత్ర సేవా పథకాన్ని వినియోగించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రాజారావు

గోపాలపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంత్ర సేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.రాజారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏవో రాజారావు మాట్లాడుతూ రైతులు గ్రూపులుగా ఏర్పాటు యంత్ర సేవా పథకంలో 40 శాతం సబ్సిడీపై డ్రోన్లు, యంత్రాలు తీసుకోవచ్చన్నారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సార్వా ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు సరైన సమయంలో సలహాలు సూచనలు అందజేయాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పీతల ప్రసాద్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

డ్రై డేతో దోమల నివారణ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం: వారానికి ఒక్కసారి డ్రై డే పాటించడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని తణుకు మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి ఏరియాలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్‌లో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మలేరియాను వ్యాప్తి చేసే ఎనాఫిలస్ దోమ నిలకడగా ఉన్న నీటిపై గుడ్లు పెడుతుందని, ఇవి 8 నుంచి 10వ రోజు దోమలుగా మారతాయన్నారు. ఈ దోమలు రాత్రి పూట కుడతాయన్నారు. ప్లాస్మోడియం పరాన్నజీవితో సంక్రమణం చెందిన ఈ ఎనాఫిలస్ ఫిమేల్ దోమలు కుట్టడం వల్లే మలేరియా వస్తుందన్నారు. చలి, జ్వరం, వణుకు ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ కాలంలో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరాజు, గ్రామ ఆరోగ్య కార్యదర్శి మేరి రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన


విస్సారమ్మ చెరువును పరిశీలిస్తున్న వై.వరప్రసాద్

నల్లజర్ల: అమృత్ సరోవర్ పథకంలో జరుగుతున్న చీపురుగూడెం విస్సారమ్మ చెరువు అభివృద్ధి పనులను కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి వై.వరప్రసాద్ పరిశీలించినట్టు ఏపీఓ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ చెరువు చుట్టూ ప్లాంటేషన్ పెంచాలని సూచించారు. దాతల సహకారంతో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఏపీడీలు అప్పలరాజు, శ్రీనివాస్ నల్లజర్ల ఏపీఓ సత్యనారాయణ, టీఏలు శ్రీనివాస్, నాగరాజు, కె.సందీప్ ఉన్నారు.

బీరువాలో రూ.1.50 లక్షల చోరీపై కేసు

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లిలో అంబటి కాంతమ్మకు చెందిన రూ.1.50 లక్షల నగదును దుండగులు అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ సుభానీ శుక్రవారం తెలిపారు. అంబటి కాంతమ్మ కుమారుడు చంద్రరావు ఈనెల 7వ తేదీన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రూ.లక్ష నగదు విత్‌డ్రా చేసి తీసుకొచ్చి తల్లికి ఇచ్చాడు. కాంతమ్మ వద్ద ఉన్న రూ.50 వేలతో పాటు కొడుకు ఇచ్చిన రూ.లక్ష నగదును బీరువాలో పెట్టింది. శుక్రవారం బీరువా తెరచి చూడగా నగదు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి ముందు నివాసం ఉండే ఓ మహిళపై అనుమానం ఉన్నట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుభానీ పేర్కొన్నారు.

పిల్లల మానసికోల్లాసానికి వేసవి శిక్షణ


శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపురం: పిల్లల మానసికోల్లాసానికి వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసినట్టు యునైటెడ్ ఫాస్టర్ల అసోషియేషన్ అధ్యక్షుడు రెవ ఫాదర్ తిగిరిపల్లి గాబ్రియేలు అన్నారు. గోపాలపురం ఎస్సీ హాస్టల్ ఆవరణలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఫాస్టర్ గాబ్రియేలు మాట్లాడుతూ కుల మతలకు అతీతంగా ఈ నెల మూడో తేదీ నుంచి 17ఏళ్ల బాలబాలికలకు ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. 12 మంది ఉపాధ్యాయులతో సుమారు 500 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్లు మోజేష్ నాయుడు, టి.రాజ్‌పాల్, భేతేలు ప్రార్థనా మందిరం ఫాస్టర్లు షైనీ ఇండియా పాల్గొన్నారు.